క్లుప్తంగా

కట్టంగూర్ ఎఫ్‌పీఓ పరిశీలన



నిమ్మ గ్రేడింగ్ యంత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆర్‌వి కర్ణన్

కట్టంగూర్ : మండలంలోని అయిటిపాముల పంచాయతీ పరిధి గంగదేవిగూడెం సమీపంలో ఉన్న కట్టంగూర్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌ను శుక్రవారం కలెక్టర్ ఆర్‌వి కర్ణన్ సందర్శించారు. కంపెనీలో గల వ్యవసాయ పనుముట్లు, నిమ్మ గ్రేడింగ్, నిమ్మ ఒరుగుల తయారీ యంత్రాన్ని, కోల్డ్ స్టోరేజీని ఆయన పరిశీలించారు. రైతులు సంఘటితంగా ఏర్పడి సాగులో సాంకేతికతను ఉపయోగించడంపై వారికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఆయన వెంట ఎస్పీ అపూర్వ రావు, ఎంపీడీఓ సునీత, ఏపీఎం వినోద, వాడేపల్లి రమేష్ తదితరులు ఉన్నారు.

చంద్రయాన్- 3పై విద్యార్థులకు ప్రాజెక్ట్ వర్క్

కట్టంగూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ప్రాజెక్ట్ పనిలో భాగంగా శుక్రవారం చంద్రయాన్- 3పై ప్రాజెక్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సమాచార, ఛాయా చిత్రాల, విషయ సేకరణలో ప్రతిభ కనబర్చారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్‌ఎం అంజయ్య బహుమతులు అందజేశారు.

100పడకల ఆస్పత్రి సందర్శన



కమిషనర్ అజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న వైద్యసిబ్బంది

నకిరేకల్ : పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న తెలంగాణ వైద్యవిధాన పరిషత్ వైద్యశాలను (100 పడకల ఆస్పత్రిని) శుక్రవారం వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సిబ్బంది ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. సుదీర్ఘకాలంగా ఉన్న మా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమ మల్లన్న, డాక్టర్ హేమలత, ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఇట్టిమళ్ల అమృత రావు, రామచంద్రు, విజయరాణి, బాబురావు, ఉస్మాన్, ఉమామహేశ్వరి ఉన్నారు.

రైతులకు రూ.199కే ప్రమాద బీమా

మర్రిగూడ : రైతులకు ఏడాదికి రూ.199తో రూ.3లక్షల ప్రమాద బీమా కల్పిస్తున్నట్లు స్థానిక మన గ్రోమోర్ కంపెనీ మేనేజర్ మణికంఠ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. 18–65సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఈ బీమాకు అర్హులన్నారు. రైతులు రూ.199 చెల్లించి ప్రమాద బీమాను పొందవచ్చన్నారు. ఈ బీమా పాము కాటు, పిడుగుపాటు, విద్యుదాఘాతం, రోడ్డు ప్రమాదాలకు వర్తిస్తుందన్నా రు. వివరాలకు 89787 81308ను సంప్రదించాలన్నారు.

గృహ అవసరాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి



ధర్నా చేస్తున్న నాయకులు, గ్రామస్తులు

చిట్యాల : గృహావసరాలకు 300వందల యూనిట్ల విద్యుత్‌ను ప్రభుత్వం ఉచితంగా అందించాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేద దళిత కుటుంబాలకు 101యూనిట్‌ల ఉచిత విద్యుత్‌ను అందించాలన్నారు. అనంతరం ట్రాన్స్‌కో ఏఈ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పంది నరేష్, కత్తుల యాదయ్య, కోనేటి రాములు, చంద్రగిరి రవికుమార్, జిట్ట స్వామి, మేడి సుగుణమ్మ, పాల లక్ష్మయ్య, సాలయ్య, ముత్తయ్య, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

రామగిరి(నల్లగొండ) : లైంగికదాడికి గురైన ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ద్వారా సత్వర న్యాయం చేయాలని ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివ అన్నారు. శుక్రవారం న్యూఢిల్లీలో జాతీయ ఎస్సీ కమీషన్ ఛైర్మన్ విజయ్ సంప్లాను ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో హత్యలకు గురైన ఎస్సీ, ఎస్టీల కుటుంబాలకు నష్టపరిహారం అందించాలని, కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు.

శిథిలావస్థలో పంచాయతీ భవనం

- పెచ్చులూడుతున్న భవనం పైకప్పు
- భయం భయంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది
- నూతన భవనం నిర్మించాలని విజ్ఞప్తి



శిథిలావస్థకు చేరిన గుడివాడ పంచాయతీ కార్యాలయం



పెచ్చులూడుతున్న పంచాయతీ భవనం పైకప్పు

కేతేపల్లి: మండలంలోని గుడివాడ గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరింది. అధికారులు పట్టించుకోకపోవడంతో పెచ్చులూడుతూ ఎప్పుడు కూలుతుందోననే భయంతో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. గ్రామంలో సుమారు 1200 కుటుంబాలు, 3500 పైగానే జనాభా ఉంది. ఈ భవనాన్ని 1984లో నిర్మించారు. కార్యాలయ భవనంలోని మూడు గదుల పైకప్పు నెర్రెలు పట్టి, ఇనుప చువ్వలు బయటకు తేలాయి. ఇటీవల నిత్యం కురుస్తున్న వర్షాలతో నీరు నెర్రెల ద్వారా కారుతుండడంతో భవనం పైకప్పు పెచ్చులూడి కింద పడుతున్నాయి. దీంతో భవనం ఎక్కడ కూలుతుందోననే భయంతో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వర్షాలు వచ్చిన సమయంలో కార్యాలయంలోని ఫైళ్లు, సామగ్రి తడుస్తున్నాయని సిబ్బంది వాపోతున్నారు. రోజుల తరబడి కురుస్తున్న వర్షాలతో గోడలు, పైకప్పు పాడయ్యాయి. ఎప్పుడు, ఏమూలన పెచ్చులూడుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఎలాంటి ప్రమాదం జరగక ముందే జిల్లా పంచాయతీ అధికారులు చొరవ చూపి నూతన భవనాన్ని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరుబయట సమావేశాలు నిర్వహిస్తున్నాం



గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. తరుచూ పైకప్పు పెచ్చులూడుతుండడంతో పంచాయతీ పాలకవర్గ సమావేశాలను ఆరు బయట నిర్వహిస్తున్నాం. వర్షం వస్తే కురుస్తుంది. విధుల నిర్వహణకు సిబ్బంది భయపడుతున్నారు. జిల్లా పంచాయతీ అధికారులు స్పందించి నూతన భవనాన్ని నిర్మించాలి.

– కట్ట శ్రవణ్, సర్పంచ్, గుడివాడ

ప్రతిపాదనలు పంపించాం

పంచాయతీ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరిన విషయం వాస్తవమే. నూతన భవనం నిర్మాణం కోసం ప్రభుత్వానికి గతంలోనే అధికారులు ప్రతిపాదనలు పంపించారు. నిధులు మంజూరు కాగానే నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

– సంపత్‌కుమార్, ఏఈ, పీఆర్, కేతేపల్లి

గుండె జబ్బులపై అప్రమత్తంగా ఉండాలి



సీపీఆర్ విధానంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

నల్లగొండ టౌన్ : గుండె జబ్బుల పట్ల ప్రజలు ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని రివర్‌నిమ్స్ ఆస్పత్రి గుండె చికిత్సల వైద్యులు పవన్‌తేజ, సంపత్‌కుమార్, సాయికృష్ణారెడ్డి, విజయ్‌కుమార్, సూచించారు. శుక్రవారం వరల్డ్ హార్ట్ డే సందర్భంగా పట్టణంలోని ఎన్జీ కళాశాల మైదానంలో రివర్ నిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గుండె వ్యాధులు, సీపీఆర్ విధానంపై యువతకు అవగాహన కల్పించారు. గుండెపోటు వచ్చిన వెంటనే సీపీఆర్ పద్ధతి ద్వారా ప్రాణాలు కాపాడే విధానంపై వివరించారు. గుండె జబ్బులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు, సూచనలు చేశారు. తమ ఆస్పత్రిలో బైపాస్ సర్జరీలు, స్టంట్‌లు విజయవంతంగా అమర్చుతూ ఎందరో ప్రాణాలను కాపాడుతున్నామన్నారు. ఆరోగ్యశ్రీ సేవల ద్వారా పేదలకు ఉచితంగా అన్ని రకాల వైద్యసేవలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పుల్లారావు, మిర్యాల యాదగిరి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఈ -కేవైసీ చేయించుకోవాలి

చండూరు : రేషన్‌కార్డులో ఉన్న ప్రతిఒక్కరూ ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని తహసీల్దార్ రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన రేషన్‌డీలర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో డీటీ వరప్రసాద్ ఉన్నారు.

ప్రగతి నివేదన సభను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : పట్టణంలో అక్టోబర్ 2న నిర్వహించనున్న ప్రగతి నివేదన సభకు ప్రజలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గం అభివృద్ధిలో రాష్ట్రంలోనే ముందంజలో ఉందన్నారు. గత ఎన్నికల ముందు సీఎం కేసీఆర్ దత్తత తీసుకుంటానని చెప్పి ఇచ్చిన మాట నిలబెట్టుకొని వందల కోట్లు ఇచ్చి అభివృద్ధిని పరుగులు పెట్టించినట్లు తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి ఏదో ఒకటి అందుతుందని తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్‌వలి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మార్కెట్ చైర్మన్ చీర పంకజ్‌యాదవ్, నాయకులు కటికం సత్తయ్యగౌడ్, బోయపల్లి కృష్ణారెడ్డి, బొర్ర సుధాకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, అభిమన్యు శ్రీనివాస్, యామ దయాకర్, బోనగిరి దేవేందర్, పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, దేప వెంకట్‌రెడ్డి, అయితరాజు యాదయ్య, బకరం వెంకన్న, నాగరత్నం రాజు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవాలని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఔట్‌డోర్ స్టేడియంలో మండల, డివిజన్ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, డీఈఓ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

గాంధీ గ్లోబల్, ట్రస్మా ఆధ్వర్యంలో అన్నదానం..

పోటీలకు హాజరైన క్రీడాకారులకు గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సంస్థలు, ట్రస్మా ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు పోటీల్లో పాల్గొంటున్న 550మందికి అన్నదానం చేస్తున్నట్లు గాంధీ గ్లోబల్ సంస్థల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ అరుంధతి, శ్రీనివాస్, అజీజ్ షరీఫ్, గిరిబాబు, విమల, కవిత పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



చిట్యాలలో మాట్లాడుతున్న శ్రీనువాసులు

చిట్యాల : విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులను సుప్రీంకోర్టు తీర్పు అనుసరించి రెగ్యులరైజ్ చేయాలని సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపకుడు బోయ శ్రీనువాసులు, ఆ ఉద్యోగ సంఘం జాక్ నాయకులు తిరందాస్ సంతోష్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమగ్ర శిక్షా ప్రాజెక్టులో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు 180రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలని, విద్యాశాఖలో చేపట్టే ఉద్యోగ నియామకాలలో వెయిటేజ్ ఇవ్వాలని, వేతనాలు అందించాలని కోరారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు గుడిపాటి జాన్, వరలక్ష్మి, యాదమ్మ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

కేతేపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు రాష్ట్ర వైద్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావుకు విన్నవించారు. ఈ మేరకు శుక్రవారం నకిరేకల్ పర్యటనకు వచ్చిన మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో విద్యాశాఖ అభివృద్ధికి కృషి చేస్తున్న 22వేల మంది సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఎంటీఎస్ జీఓ వచ్చేలా చూడాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం రాష్ట్ర కార్యదర్శి కంచర్ల మహేందర్, నాయకులు చంద్రశేఖర్, మల్లయ్య, యల్లయ్య తదితరులు ఉన్నారు.

తెలంగాణలో బీజేపీతోనే సమగ్రాభివృద్ధి సాధ్యం



కేతేపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్

కేతేపల్లి : తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తేనే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ ప్రవాస్ యోజన మండల ఇన్‌చార్జ్ కొత్తపల్లి వెంకట్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ మండల ప్రవాస్ యోజన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాచకొండ గోపి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు అయితగోని అనిత, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సాయన్న, నాయకులు కూరెళ్లి వెంకన్న, జటంగి రాంచంద్రయ్య, టి.నర్సింహచారి, చెరుకు రోషయ్య, రాచకొండ శ్రీను, వి.నాగయ్య, ఎ.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

శాలిగౌరారం : గ్రామాల్లో బీజేపీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఆ పార్టీ ప్రవాస్ యోజన మండల ఇన్‌చార్జ్ గడ్డం వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ మండల ప్రవాస్ యోజన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తొమ్మిదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను గ్రామాల్లో వివరించాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు జమ్ము రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గుడుగుంట్ల సాయన్న, నాయకులు ఆలె రాములు, అయితగోని గణేష్, బోడ రాజు, తుల వెంకటేశ్వర్, సీహెచ్ అంజయ్య, కుంభం నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన వేతనాలను వెంటనే జమచేయాలి



నల్లగొండ టౌన్ : మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నాలో మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

నల్లగొండ టౌన్ : మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాలను వెంటనే ఖాతాల్లో జమచేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక డీఈఓ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన పథకం యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్మికులు వెయ్యి పాఠశాలలో వంటలను బంద్ చేసి సమ్మె బాటపట్టారన్నారు. పెండింగ్ బిల్లును చెల్లించాలని డిమాండ్ చేశారు. బిల్లులు చెల్లించే వరకు పోరాటం ఆపమని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి పాలె సత్యనారాయణ, అధ్యక్షుడు ఎస్‌కె ఖరీమున్నీసా, వరికుప్పల ముత్యాలు, నీరుడు రాజ్యలక్ష్మి, మేడి సైదులు, పాలగాని యాదమ్మ, అల్లి అనురాధ, పానుగంటి లక్ష్మమ్మ, కిన్నెర సైదమ్మ, దొడ్డి అండాలు, అనుముల అలివేలు, అంజమ్మ, గీత, మంగమ్మ, అండాలు, సునీత, దమయంతి, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన వర్కర్ల ముందస్తు అరెస్ట్

చిట్యాల : తమ సమస్యలు పరిష్కరించాలని నల్లగొండలోని డీఈఓ కార్యాలయ ముట్టడికి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సీఐటీయూ అనుబంధ సంస్థ మధ్యాహ్న భోజన పథకం వర్కర్లను శుక్రవారం మండల పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచికత్తుపై వారిని విడుదల చేశారు. ఈ అరెస్ట్‌ను ఖండిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారబోయిన శ్రీనువాసులు పేర్కొన్నారు. అరెస్ట్ అయిన వారిలో మేడి హంస, మేడి లలిత, అవిశెట్టి సత్తమ్మ, జయమ్మ, లక్ష్మి, పార్వతమ్మ, అన్నపూర్ణ ఉన్నారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



నల్లగొండ టౌన్: వంటా వార్పులో పాల్గొన్న అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు



మర్రిగూడ : అంగన్‌వాడీలకు సంఘీభావం తెలిపి మాట్లాడుతున్న శంకరాచారి

మర్రిగూడ : అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆందోజు శంకరాచారి అన్నారు. మండల కేంద్రంలో అంగన్‌వాడీలు నిర్వహిస్తున్న సమ్మెకు శుక్రవారం ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. కనీస వేతనం రూ.30వేలు అందించడంతో పాటు రూ.5లక్షల ప్రమాదబీమా వర్తింపజేయాలన్నారు. 19రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. డిమాండ్లు నెరవేర్చకపోతే బీఎస్పీ ఆధ్వర్యంలో ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య, బీఎస్పీ మండల అధ్యక్షుడు గ్యార వెంకటేష్, పల్లె లింగస్వామి, జిల్లా అశోక్, ఏర్పుల క్రాంతి, ఆయా గ్రామాల అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లగొండ టౌన్ : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ ఉద్యోగులు, కార్మికులు శుక్రవారం పట్టణంలోని సీడీపీఓ కార్యాలయం ఎదుట వంటా వార్పు చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కొంత కాలంగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. కనీస వేతనాలను పెంచి, ఈఎస్ఐ, పీఎఫ్, ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వెంటనే ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చలు జరిపి సమ్మెను విరమింపజేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, అద్దంకి నర్సింహ, సైదాచారి, కె.విజయలక్ష్మి, పాదూరి లక్ష్మి, పక్కృతాంబ, మణిరూప, కళ్యాణి, రేణుక, ప్రమీల, వాణి, నాగమణి, యాదమ్మ, సముద్రమ్మ, జ్యోతి, సరిత, సునీత తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ముందస్తు అరెస్టు



నకిరేకల్ : పోలీస్‌స్టేషన్‌లో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, నాయకులు

నకిరేకల్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ ఉద్యోగులు 20రోజులుగా పట్టణంలో సమ్మె కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం పట్టణంలో మంత్రుల పర్యటన సందర్భంగా వారిని ముందుస్తుగా పోలీసులు అరెస్ట్ చేసి స్థానిక స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో సీఐటీయూ నాయకుడు వంటిపాక వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ సంఘం జిల్లా అధ్యక్షురాలు పోడిచెటి నాగమణి, సీఐటీయూ నాయకులు వంటిపాక వెంకటేశ్వర్లు, సంఘం ప్రతినిధులు లక్ష్మి, తరాల శోభారాణి, లూర్దు మేరీ, అండాలు, లలిత, లతీఫా, జయమ్మ, అరుణ, తదితరులు ఉన్నారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



నల్లగొండ టూటౌన్ : కమిషనర్ రమణాచారికి సమ్మె నోటీస్ అందజేస్తున్న కార్మికులు

నల్లగొండ టూటౌన్ : మున్సిపల్ కార్మికులకు రూ.21వేల వేతనం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ.సలీం డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే అక్టోబర్ 8నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు శుక్రవారం కార్మికులు మున్సిపల్ కమిషనర్ కేవీ.రమణాచారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సలీం మాట్లాడారు. రాష్ట్రంలోని కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీల్లో మొత్తం 65వేల మంది ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారని, వారికి వేతనాలు పెంచి గతంలో సీఎం ఇచ్చిన హామీ ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధ్యంతర భృతి ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వర్తింపజేయాలని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, యూనియన్ మహిళా కన్వీనర్ పెరిక అంజమ్మ, పేర్ల సంజీవ, పాలడుగు వెంకటేశం, జీడిమెట్ల నరసింహ, లింగయ్య, నక్క సత్తయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

చిట్యాల : మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలను పెంచాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారబోయిన శ్రీనువాసులు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ మందడి రామదుర్గారెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనువాసులు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు కార్మిక చట్టాలను అమలు చేయాలని, తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ కార్యదర్శి రుద్రవరం నర్సింహ, కోశాధికారి పాల లక్ష్మయ్య, జిట్ట మణెమ్మ, పాల దుర్గమ్మ, గోలి ధనలక్ష్మి, సైదులు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నివీర్ ఫలితాల్లో ఎన్జీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

రామగిరి(నల్లగొండ) : ఇటీవల విడుదలైన అగ్నివీర్ ఫలితాల్లో ఎన్జీ కళాశాలలో చదువుతున్న 12మంది విద్యార్థులు తమ ప్రతిభ చాటి అగ్నివీర్లుగా ఎంపికయ్యారు. దీంతో శుక్రవారం వారిని ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యామ్ అభినందించారు. కార్యక్రమంలో పీడీ కడారి మల్లేష్, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

యువ కబడ్డీ సిరీస్‌లో ఎన్జీ కళాశాల విద్యార్థి



కుంటిగొర్ల కోటేష్

రామగిరి(నల్లగొండ) : తమిళనాడులోని మధురైలో నిర్వహించిన యువ కబడ్డీ సిరీస్ మన్సూన్ ఎడిషన్ 2023లో ఎన్జీ కళాశాలకు చెందిన కుంటిగొర్ల కోటేష్ ఆడుతున్నాడు. కోటేష్ ఎన్జీ కళాశాలలో బీఏ ఫైనల్ చదువుతున్నాడు. సెప్టెంబర్ 24నుంచి అక్టోబర్ 22వరకు జరిగే ఈ సిరీస్‌లో విజయనగర వీర్స్ జట్టు తరపున ఆడుతున్నాడు. కోటేష్ కబడ్డీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చడం పట్ల ప్రిన్సిపాల్ ఘనశ్యామ్, పీడీ కడారి మల్లేష్ హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా కవి జాషువా జయంతి

నల్లగొండ రూరల్ : నవయుగ కవి గుర్రం జాషువా 128వ జయంతిని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానికి తెలుగు శాఖ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యాపకులు గంగాధర నర్సింహ, ఆనంద్, సత్యనారాయణరెడ్డి, అనితకుమారి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్ష పదవులకు రాజీనామా

కనగల్ : మండలంలోని పలు గ్రామాల బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు శుక్రవారం ఆ పదవులకు రాజీనామా చేశారు. మండలంలోని చెట్లచెన్నారం గ్రామ అధ్యక్షుడు అప్పల శ్రీనివాస్‌గౌడ్, పగిడిమర్రి గ్రామ అధ్యక్షుడు సీత నాగరాజు వారి పదవులకు రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, పార్టీ మండల నాయకుల ఒంటెద్దు పోకడలు, బెదిరింపులకు నిరసనగా పదవులకు రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. బీసీ నాయకుడు పిల్లి రామరాజుయాదవ్ వెంట నడుస్తామన్నారు. ఇదే బాటలో చర్లగౌరారం గ్రామశాఖ అధ్యక్షుడు గుండెబోయిన ఉపేందర్ కూడా రాజీనామా చేయనున్నట్లు సమాచారం.

నకిరేకల్ సభ సక్సెస్..

నకిరేకల్ : నకిరేకల్‌లో శుక్రవారం మంత్రులు హరీశ్‌రావు, జగదీష్‌రెడ్డి నిర్వహించిన సభ సక్సెస్ అయ్యింది. ఈ సభకు నకిరేకల్, కట్టంగూరు, కేతేపల్లి మండలాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. రామన్నపేట నుంచి నకిరేకల్‌కు విచ్చేసిన మంత్రులకు స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. మంత్రుల రాక సందర్భంగా ఎస్పీ అపూర్వరావు నేతృత్వంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందుస్తుగా అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

చేనేత రుణాలు మాఫీ చేయాలి

మునుగోడు : మంత్రి కేటీఆర్ ఇటీవల ప్రకటించిన చేనేత రుణమాఫీని వెంటనే అమలుచేసి చేనేత కార్మికుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని చేనేత సహకార సంఘం మండల సభ్యులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేనేతల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన చేనేత మిత్ర, త్రిఫ్ట్ ఫండ్, నేతన్న బీమా, హెల్త్‌కార్డులు జారీ ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, అందుకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. చేనేత కార్మికులను మునుగోడు అసెంబ్లీ నుంచి పోటీచేసే అవకాశం అన్ని పార్టీలు కల్పించాలని తీర్మాణం చేశారు. కార్యక్రమంలో పద్మశాలి యువజన విభాగం జాతీయ ఇన్‌చార్జ్ అవ్వారి భాస్కర్, మునుగోడు చేనేత సహకార సంఘం ఉపాధ్యక్షుడు సంగిశెట్టి పరమేష, కోశాధికారి జగనాథం, పరమేష్, కృపానందం, శివకుమార్, గణేష్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశంకు ఘన స్వాగతం



నకిరేకల్ : ఎయిర్‌పోర్టులో వీరేశానికి స్వాగతం పలుకుతున్న అనుచరులు

చిట్యాల : బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరి ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశంకు శంషాబాద్ విమానాశ్రయంలో శుక్రవారం మండలానికి చెందిన పలువురు నాయకులు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. వారిలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు అంతటి వెంకటేష్‌గౌడ్, సర్పంచ్‌లు జనగాం రవీందర్‌గౌడ్, అద్దెల నర్సిరెడ్డి, ఎంపీటీసీ వడ్డెపల్లి లక్ష్మయ్య, మాజీ ఎంపీటీసీ ఎద్దులపురి కృష్ణ, చిట్యాల మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు జడల చినమల్లయ్య, మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ, ఉపసర్పంచ్ సాగర్ల నరేష్, మెట్టు మనోహర్, గోలి మహేష్, సల్ల రాజు, నూతి సైదులు తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ : నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం గురువారం ఢిల్లీలో కాంగ్రెస్ చేరి శుక్రవారం హైదరాబాద్‌కు వస్తున్నందున ఆయన అనుచరులు, అభిమానులు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు భారీగా తరలివెళ్లి ఘన స్వాగతం పలికారు. వీరేశం కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా శుక్రవారం ఉదయం ఢిల్లీలో ఆ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కలిసిన వారిలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.